# Andhra Jyothi

## ఉద్యోగాలు, ఉపాధి కల్పనే లక్ష్యం

**హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి):** తెలంగాణలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కె.తారకరామారావు అన్నారు. మలేషియాలోని పెనాంగ్ రాష్ట్ర డిప్యూటీ సీఎం డా.పి. రామస్వామి ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం బుధవారం హైదరాబాద్లోని ఓ హోటల్లో మంత్రి కేటీఆర్తో భేటీ అయింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, మౌలిక సదుపాయాల కల్పన రంగాల్లో కలిసి పని చేయడానికి ఇరు రాష్ట్రాలు అంగీకరించాయి. ఆర్థిక సహకారంపైనా చర్చించారు. ఇప్పటికే పలు మలేషియా కంపెనీలు తెలంగాణలోని మౌలిక సదుపాయాల కల్పన రంగంలో పెట్టుబడులు పెట్టాయని రామస్వామి గుర్తు చేశారు. కేటీఆర్ మాట్లాడుతూ...ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనలో 'పెనాంగ్ డెవల్పమెంట్ కార్పొరేషన' అనుసరిస్తోన్న విధానాన్ని అధ్యయనం చేయడానికి త్వరలోనే రాష్ట్ర బృందం పెనాంగ్ను సందర్శిస్తుందని తెలిపారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పెంపొందించే లక్ష్యంతో ఇప్పటికే తమ ప్రభుత్వం తయారీ రంగాన్ని బలోపేతం చేస్తోందన్నారు. ఇందుకోసం లైఫ్ సైన్సెస్, ఇన్ఫర్మేషన టెక్నాలజీ, డిఫెన్స, ఏరోస్పేస్ వంటి 14 ప్రాధాన్య రంగాలను గుర్తించామని, ఈ రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని పెనాంగ్ బృందాన్ని కోరారు. తయారీ రంగంలో సహకరించడానికి పెనాంగ్ సిద్ధంగా ఉందని, నైపుణ్యాభివృద్ధికీ సహకరిస్తామని రామస్వామి తెలిపారు. తెలంగాణ కూడా సేవలు, సాఫ్ట్వేర్ రంగాల్లో పెనాంగ్ రాష్ట్రానికి సహకరించాలని కోరారు.